RNI NO: TELTEL/2016/73311

www.samasamajam.in

హైదరాబాద్
18-8-2023
సంపుటి:08
సంచిక: 346
పేజీలు: 4
వెల: రూ.5/-

CEO & Editor : G. PRUDHVIRAJ

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY

తెలుగు దిన పత్రిక

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## గంజాయి పుష్ప

- ఖరీదైన కార్లలో ప్రత్యేక అరల ద్వారా స్మగ్లింగ్
- తనిఖీల నుంచి తప్పించుకోవడానికి కార్లపై
- పోలీసు ఉన్నతాధికారుల స్టిక్కర్లు, సైరన్లు
- విశాఖలో కిలో గంజాయి రూ.4 వేలకు కొని
- మహారాష్ట్రలో రూ.20 - 25 వేలకు అమ్మకం
- ప్రతి ట్రిప్పులోనూ 100 కేజీల దాకా సరఫరా
- కోట్లకు పడగలెత్తిన హైటెక్ గంజాయి స్మగ్లర్
- తెలంగాణలో అరెస్ట్.. కార్లు, గంజాయి స్వాధీనం

హైదరాబాద్ : అతడి వాహనానికి పోలీస్ సైరన్ ఉంటుంది! సందర్భాన్ని బట్టి కారుపై ప్రభుత్వ ఉన్నతాధికారుల స్టిక్కర్లు కూడా ఉంటాయి! ఆ స్టిక్కర్లను అతికించుకుని.. కుయ్‌కుయ్‌మనే పోలీస్ సైరన్‌తో.. ఖరీదైన కారులో దర్జాగా కూర్చుని రయ్‌మంటూ దూసుకుపోతూ హల్‌చల్ సృష్టిస్తుంటాడు!! అంతటి డాబు, దర్పం ప్రదర్శిస్తున్న వ్యక్తి ఏ ఉన్నతాధికారో



మిగతా 3లో

## అధికారం ఇచ్చినా ఏమీ చేయని అసమర్థులు



- కాంగ్రెస్ నేతలపై మంత్రి కేటీఆర్ ధ్వజం
- ఆ పార్టీతో వెళ్తే కుక్క తోకను పట్టుకుని గోదావరి ఈదినట్లే
- వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను 95 సీట్లతో గెలిపించాలని కార్యకర్తలకు పిలుపు
- తెల్లం వెంకట్రావు సహా పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌లో చేరిక

హైదరాబాద్: 'రాష్ట్రంలో ఒక్కసారి అధికారం ఇవ్వండి అని కాంగ్రెస్ అడుగుతోంది. ఇప్పటి వరకు పది పదకొండు మార్లు అవకాశం ఇచ్చినా ఏమీ చేయలేని అసమర్థులు కాంగ్రెస్ నేతలు. వారు ఇప్పుడు ఆకాశం నుంచి ఊడిపడినట్లుగా వ్యవహరిస్తూ, పేదల కోసం పనిచేసే కేసీఆర్‌ను తిడుతున్నారు. ఎవరి వల్ల మంచి జరుగుతుందో చూడండి. ఎవరైనా డబ్బులు ఇస్తే ఏం చేయాలో ఆలోచించుకుని ఓటు మాత్రం కేసీఆర్‌కు వేయండి'అని

మిగతా 3లో

## కాంగ్రెస్‌లోనే ఉన్నా.. ఇకపై ఉంటా!

- కాంగ్రెస్‌లోనే ఉన్నా.. ఇకపై ఉంటా!
- జూపల్లి, దామోదర్ ఇప్పుడొచ్చి టికెట్ మాదేనంటున్నారు
- రాష్ట్ర రాజకీయాల్లో నేనే సీనియర్: నాగం



3లో

## గిరిజన మహిళపై థర్డ్‌డిగ్రీ..

- రాత్రంతా ఠాణాలోనే ఉంచి చిత్రహింసలు
- ఒళ్లు కమిలేలా లాఠీలతో కొట్టారు.. బూటుకాళ్లతో తన్నారు
- ఎల్‌బీనగర్ స్టేషన్ పరిధిలో ఘటన..



3లో



## ఆర్టీసీ బిల్లు.. మళ్లీ లొలి

- న్యాయ సలహా కోరిన గవర్నర్ తమిళిసై!
- పాత బిల్లులపై నా మాట పట్టించుకున్నారా?
- నా సిఫార్సులపై తీసుకున్న చర్యలేమిటి..?
- నిర్ధారించాలంటూ న్యాయ శాఖకు నిర్దేశం
- సభ మరోసారి ఆమోదించిన 4 బిల్లులపైనా

హైదరాబాద్, ప్రభుత్వంలో టీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లు గురువారం రాష్ట్ర గవర్నర్ తమిళిసై నుంచి న్యాయశాఖ పరిశీలనకు వెళ్లింది. దాంతోపాటు కొద్ది నెలలుగా ప్రభుత్వానికి గవర్నర్‌కు మధ్య తిరుగుతున్న మరో నాలుగు బిల్లులను కూడా మరోసారి న్యాయశాఖ పరిశీలనకు పంపారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుల ఆమోదం విషయంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తనదైన శైలిలో వ్యవహరిస్తున్నారు. ప్రతీ బిల్లునూ క్షుణ్ణంగా పరిశీలించి సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. ప్రభుత్వం సంతృప్తికరమైన


మిగతా 3లో

## జాబిల్లికి చేరువగా విక్రమ్ ల్యాండర్

- సురక్షితంగా విడిపోయిన మాడ్యూల్
- ఇక చంద్రుడిపై అడుగే తరువాయి
- వేగాన్ని తగ్గిస్తూ దించనున్న ఇస్రో
- చంద్రయాన్-3లో మరో కీలక ఘట్టం

సూళ్లూరుపేట, బెంగళూరు,: చంద్రుడిపై అడుగుపెట్టి.. అక్కడి ఉపరితలంపై అధ్యయనం చేసే లక్ష్యంతో జాబిల్లి దిశగా దూసుకెళ్లిన చంద్రయాన్-3 మరో మైలురాయిని అధిగమించింది. ప్రొపల్షన్ మాడ్యూల్ సాయంతో ఇన్ని రోజులూ జాబిల్లి కక్ష్యలో తిరిగిన ల్యాండర్ మాడ్యూల్ గురువారం దాని నుంచి విజయవంతంగా విడిపోయిట్టు ఇస్రో

మిగతా 2లో






## ఉన్నత విద్యలో 'గేమ్ చేంజర్'

### ప్రముఖ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం

- మన విద్యార్థులు ప్రపంచ స్థాయి వర్సిటీల నుంచి కోర్సులు ఉచితంగా చదివే అవకాశం
- హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి సహా పలు అత్యుత్తమ వర్సిటీల నుంచి సర్టిఫికేషన్లు
- రెగ్యులర్ కోర్సులతో పాటు చదువుకోవచ్చు.. విద్యార్థులకు సర్టిఫికెట్లు, క్రెడిట్లు జారీ
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలను మెరుగుపడ్చేలా కోర్సులకు రూపకల్పన.. ఆధునికతను అంది పుచ్చుకుంటూ విద్య అందించడమే లక్ష్యం
- విద్యార్థులకు నచ్చిన వర్టికల్స్‌లో విద్యను అందించేలా చర్యలు
- అంతర్జాతీయ వర్సిటీల కోర్సులు ఉచితంగా నేర్చుకునే అవకాశం: సీఎం వైఎస్ జగన్

అమరావతి: ఉన్నత విద్యారంగంలో మరో విప్లవాత్మక మార్పునకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పేద, మధ్య తరగతి విద్యార్థులకు సైతం ప్రపంచ స్థాయి కోర్సులను అందించేందుకు మార్గం సుగమం చేసింది. హార్వర్డ్, ఎంఐటీ, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జి సహా ఇతర ప్రపంచ అత్యుత్తమ వర్సిటీల సర్టిఫికేషన్ పొందేలా ప్రముఖ మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సుల సంస్థ 'ఎడెక్స్'తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గురువారం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఎడెక్స్ వ్యవస్థాపకుడు, సీఈవో, పద్మశ్రీ అవార్డు గ్రహీత అనంత్ అగర్వాల్, ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జె.శ్యామలరావు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ విశ్వవిద్యాలయాలు రూపొందించిన ఎడెక్స్ ఆన్‌లైన్ కోర్సులతో రాష్ట్ర వర్సిటీ కోర్సులను మిళితం చేసి ఉత్తమ విద్య అందించేలా రోడ్ మ్యాప్ రూపొందించనున్నారు. ఎడెక్స్ ఒప్పందాన్ని ఉన్నత విద్యలో గేమ్ ఛేంజర్‌గా ముఖ్యమంత్రి జగన్ అభివర్ణించారు. ప్రపంచంలో అనూహ్యంగా మారుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలతోపాటు సామాజిక, సాంఘిక శాస్త్రాలకు సంబంధించి వివిధ రకాల సబ్జెక్టులను ఉచితంగా

మిగతా 3లో




## రైతు బంధు పక్కదారి!

- దళారులను పెట్టుకుని వ్యవసాయ శాఖ అధికారుల మాయాజాలం
- మూడేళ్లుగా లక్షల రూపాయలు స్వాహా
- నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో బయటపడ్డ బాగోతం
- మరిన్ని చోట్లా ఈ తరహా అక్రమాలు!

నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న రైతు బంధు పథకం సొమ్ము పక్కదారి పట్టింది. చనిపోయిన రైతులకు సంబంధించిన భూముల వివరాలను మార్చేసి, వేరేవారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము పడేలా చేసి.. మొత్తం మింగేస్తున్న వైనం బయటపడింది. వ్యవసాయ శాఖ అధికారులు సూత్రధారులుగా,

మిగతా 3లో

# సంపాదకీయం

## మణిపూర్ టీజర్ మాత్రమేబీ ఐమాక్స్ సినిమా ముందుంది!

మణిపూర్, హర్యానా – ఒకచోట క్రైస్తవులు, ఇంకోచోట ముస్లింలు. మతమైనారిటీలను వేధిస్తుంటే హిందూ ఓటుబ్యాంకు ధృవీకరణ చెంది ఎన్నికల్లో బీజేపీకి విజయాన్ని సాధించిపెడుతోంది. ముస్లింలనేకాదుబీ క్రైస్తవుల్ని కూడ వేధిస్తామని 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రచారం చేసి మూడోసారి ప్రధాని అవ్వాలని నరేంద్ర మోదీ సిద్ధం అవుతున్నారని అందరికీ తెలుసు. అసలు స్కెచ్ ఇంతకన్నా చాలా పెద్దది. మణిపూర్ చతురస్రాకారంలో వుంటుంది. నాలుగు సరిహద్దుల్లోనూ ఎత్తైన కొండలుంటాయి, మధ్యలో లోయ. రాజధాని ఇంఫాల్ కూడ లోయ ప్రాంతంలో వుంటుంది. రాష్ట్రంలో మెజారిటీ సామాజికవర్గంగా భావించే మెయితీలు లోయలోనే వుంటారు. మైనారిటీలుగా భావించే కుకీ జో తెగలు రాష్ట్రం చుట్టు వున్న కొండ ప్రాంతాల్లో వుంటారు. కుకీ జో ల మాతృభాష మిజావు. ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడుతారు. అంతేకాదుబీ హిందీని వ్యతిరేకిస్తారు. వాళ్ళు క్రైస్తవులు కావడం మాత్రమేగాక, ఉత్తర భారతదేశంలో ఉంటూ హిందీని దూరంగా వుంచడం కూడ సంఘపరివారానికి చిరాకు కల్పించే అంశం. ఈశాన్య రాష్ట్రాల్లోని ఎస్టీలకు దేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు వుంటాయి. 'సానుకూల వివక్షను' సద్వినియోగం చేసుకున్న కుకీ జో, నాగ తెగలు క్రమంగా ప్రభుత్వ యంత్రాంగంలో కీలకస్థానాలకు చేరుకున్నారు. ఈ తెగల అభివృద్ధిని చూసి మెయితీలు ఈర్ష్యా ద్వేషాలను పెంచుకున్నారు. ప్రస్తుత చట్టాల ప్రకారం అటవీ భూముల మీద సమస్త అధికారాలు కుకీ జో, నాగ తదితర తెగలవి. అక్కడ మెయితీలు భూములు కొనడానికి వీల్లేదు. అటవీ భూములపై మెయితీలకు హక్కు దక్కాలంటే వారికి ఎస్టీ హోదానివ్వాలి. అదే సామాజికవర్గానికి చెందిన ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ఈ దిశగా ప్రయత్నాలు మొదలెట్టడం, మణిపూర్ హైకోర్టు తదనుగుణంగా ఉత్తర్వులు జారీ చేయడంతో హింసాత్మక సంఘటనలు ఆరంభమయ్యాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ప్రజలు తమను భిన్న జాతులుగా భావిస్తారుగానీ, భారతీయులమని అనుకోరు. చాలామంది ఆధార్ కార్డ్ కూడ తీసుకోరు. ఆధార్ కార్డు తీసుకుంటే తమను భారతీయుల జాబితాలో పడేస్తారని వాళ్ళు భయపడతారు. కశ్మీర్ లోయలోనూ ఇలాగే వుంటుంది. కశ్మీర్ లోయ ప్రజలంతా తాము ఒకే జాతి వాళ్లమని భావిస్తారు. తమ భూభాగాన్ని సగం పాకిస్తాన్, సగం ఇండియా ఆక్రమించుకున్నాయనే భావనతో వుంటారు. కుకీ జోలు మాత్రమే కాదు ఈశాన్య రాష్ట్రాల్లోని గిరిజనులంతా సాధారణంగా శాంతి కాముకులు. ఇతరులు తమ జోలికి వస్తే మాత్రం ఉగ్రులైపోతారు. సాంప్రదాయకంగా వాళ్ళు సైనిక జాతి (%ఝుతీతీఱశీతీ ూతీఱఎవ / ఖీఱతీఱఙ్రీ ూతీఱఎవ%). ఆయుధాలు వాడడంలో నేర్పరులు. హైకోర్టు ప్రకటన వెలువడగానే మణిపూర్ ప్రభుత్వం ముందు జాగ్రత్తగా కుకీ జోల నుండి లైసెన్సు ఆయుధాలను స్వాధీనం చేసుకుంది. మరో వైపు మెయితీలు పోలీసు స్టేషన్ల నుండి 6 వేల ఆయుధాలను ఎత్తుకుపోయారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు పోలీసులే మెయితీలకు ఆయుధాలను సరఫరా చేశారనే మాట మణిపూర్‌లో పెద్ద ప్రచారంలో వుంది. పోలీసులు తోడుగావున్నా, ఆయుధాలు చేతిలోవున్నా తగిన శిక్షణలేని మెయితీలు వాటిని ఉపయోగించుకోవడంలో విఫమయ్యారు. ఆ అసహనంతో కుకీల ఇళ్లను తగులబెట్టారు, మహిళల్ని చెరచారు. మరోవైపు, కుకీ జోలు తమ యుద్ధ నైపుణ్యంతో నాటు తుపాకులతోనే మెయితీల మీద భీకరంగా ప్రతిదాడి చేశారు. చూరచందాపూర్ జిల్లాలోని కుకీ జో మహిళలు, పిల్లలు పక్క రాష్ట్రమైన మిజోరంకు శరణార్థులుగా వెళ్ళిపోయారు. కుకీ జో పురుషులు ఇంటికొకరు చొప్పున స్వచ్ఛంద సైనిక దళంగా మారి వంతుల వారీగా ప్రతిదాడి సాగిస్తే, దానిని తట్టుకోవడం మెయితీలకు సాధ్యం కాలేదు.

# టీచర్ల అక్రమ డిప్యూటేషన్లు చేస్తున్న డి ఈ ఓ ను డిస్మిస్ చేయాలి

**ఎస్ ఎఫ్ ఐ డిమాండ్**




**చండూరు ఆగస్టు 17: సమ సమాజం:** ఎం.ఈ.ఓ, డి.ఇ.ఓ ల కనుసన్నల్లోనే చేతులు మారుతున్న లక్షల రూపాయలు. ప్రభుత్వ టీచర్ల ను అక్రమ డిప్యూటేషన్ లు చేసిన చండూరు ఎం.ఈ.ఓ ను సస్పెండ్ చేయాలని ఖమ్మంపాటి శంకర్ ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ చండూరు డాన్ బోస్కోకళాశాల కమిటీ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ చండూరు మండలం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వుండి టీచర్ల అవసరం ఆ పాఠశాల సబ్జెక్టు కు సంబంధించిన టీచర్ అవసరం వున్నప్పటికీ కొంత మంది వ్యక్తి గత స్వార్థ ప్రయోజనాల కోసం డబ్బులు తీసుకుని విద్యార్థుల చదువులను పట్టించుకోకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అక్రమ సంపాదన కోసం ఎంఈఓ, డీఈవో లు ఈ విధంగా చేయడం జరిగింది. సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరతను దృష్టిలో వుంచుకొని ఉపాధ్యాయుల సర్దుబాటు కు ప్రభుత్వం వీలు కల్పించినది. దీన్ని ఆసరా చేసుకుని కొందరు ఎంఈఓ, డిఈఓ లు వారి స్వలాభం కొరకు ఉపయోగించుకొని అక్రమాల కు అవినీతి కి పాల్పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక పాఠశాల నుండి ఉపాధ్యాయుల డిప్యూటేషన్ చేయాలంటే ఆ కాంప్లెక్స్ పరిది లేదా మండల పరిధిలోని పాఠశాల లకు మాత్రమే చేయాలి. కాని ఎంఈఓ, డీఈవో లు ఈ నిబంధనలు ఏమాత్రం పట్టించుకోకుండా క్రింది విధంగా డిప్యూటేషన్ చేయడం జరిగింది.

1. చండూర్ మండలం లో యు.పి.ఎస్ నెర్మడ లో పనిచేస్తున్న నూస్రత్ టీచర్ ని చింతపల్లి మండలంలోని వింజమూరు జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలకు డిప్యూటేషన్ పంపడం జరిగింది.
2. చండూర్ మండలం లో పనిచేస్తున్న రామకృష్ణ ఉపాధ్యాయుడిని నల్లగొండ మండల పరిధిలోని కి అక్రమ డిప్యూటేషన్ చేయడం జరిగింది. చండూరు లో ఇక్కడ ఈ ఉపాధ్యాయుడి అవసరం వున్నది. అయినా స్వార్థ ప్రయోజనం కోసం.
3. నాంపల్లి మండలం లో పనిచేస్తున్న హజ్రా టీచర్ వేములపల్లి మండల కేంద్రానికి అక్రమ డిప్యూటేషన్ ద్వారా వెళ్ళడం జరిగింది.
4. నాంపల్లి మండలం జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల నుండి నకిరేకల్ జడ్.పి.హెచ్.ఎస్ కు మ్యాథ్స్ టీచర్ ను పంపారు. మరొకరిని నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలకు, ఇంకొకరిని ముషంపల్లికి, మరొకరి ని పసునూర్ కి పంపారు.
5. చండూర్ జడ్.పి.హెచ్.ఎస్ నుండి డిండి మండలానికి ఇంగ్లీష్ టీచర్ ను పంపారు.
6. మర్రిగూడ మండలం నుండి ఎయిడెడ్ టీచర్ ను చండూరు డిప్యూటేషన్ పంపారు.

ఈవీధంగా వీరు వెళ్ళడం జరిగింది. వీరికి ఎలాంటి కలెక్టర్, డిఈవో ఆర్డర్ లేకుండా ఇష్టానుసారంగా వ్యవహరించడం. వీరి పరిధిలోని కాంప్లెక్స్ హెడ్ మాస్టర్ల పై ఎంఈఓ, డిఈఓ లపై కోర్టులో కేసు వేస్తామని హెచ్చరించారు. పాఠాలు చెప్పకుండానే జీతాలు తీసుకుంటూ ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నా. ఎంఈఓ డిఈఓ లు అవీనితి అక్రమాల కు పాల్పడుతూ ఇటు పేద మధ్యతరగతి గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ ఎలాంటి కలెక్టర్ ఆర్డర్ కూడా లేకుండా డీఈవో, ఎంఈఓ లు తప్పుడు పద్ధతిలో డిప్యూటేషన్ చేశారు. ఈవిధంగా ప్రభుత్వ పాఠశాలల మూసివేత లకు కారణమవుతున్న చండూరు ఎం.ఈ.ఓ ను, నల్లగొండ జిల్లా విద్యాశాఖ అధికారి డి.ఈ.ఓ ల పై సమగ్ర విచారణ జరిపి తక్షణమే సస్పెండ్ చేసి పేద మధ్యతరగతి విద్యార్థుల చదువులు ముందుకు సాగేందుకు తమరు చర్యలు తీసుకోవాలని, పేద మధ్యతరగతి విద్యార్థుల తరుపున విజ్ఞప్తి చేస్తున్నాం. లేనీ పక్షంలో నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఎస్ ఎఫ్ ఐ అందోళనలకు పిలుపు నివ్వడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ సమావేశం లో తరుణ్, రవి, కృష్ణ, రమేష్, రవిందర్, జగదీశ్ సాయి సంపత్ అంజి, కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల ఆత్మగౌరవం దెబ్బతీస్తున్న రేవంత్ రెడ్డి ఖబర్దార్

**సమ సమాజం: యాదాద్రి :** మంద కృష్ణ మాదిగ పైన రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు అగ్రకులా అహంకారపూరిత మాటలే ...

మాదిగల ఆత్మగౌరవం దెబ్బతీస్తున్న రేవంత్ రెడ్డి ...

పూటకో పార్టీ మారే రేవంత్ రెడ్డి మంద కృష్ణ మాదిగ గురించి మాట్లాడే స్థాయి కాదు ...

దుబ్బ రామకృష్ణ మాదిగ. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు



వివరణ : ఎస్సీల వర్గీకరణ పైన కేంద్రంలో అధికారం లో ఉన్న బీజేపీ ప్రభుత్వం పైన ఒత్తిడి తేవడం కోసం కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు కార్గే తో మరియు యువ నాయకుడు రాహుల్ గాంధీ తో లేఖలు రాపించి వర్గీకరణ పైన తమ చిత్త శుద్ధి చాటుకోవాలని ఆగస్టు 14 తారీకు హైదరాబాద్ లోని గాంధీ భవన్లో తెలంగాణ ఇంఛార్జి టాక్రే ను మరియు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ని కలిసిన మంద కృష్ణ మాదిగ. కలిసిన సందర్భంలో మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ గురించి అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్ రెడ్డి తక్షణమే మాదిగ జాతికి బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ చట్టబద్ధత కోసం 29 సంవత్సరాలుగా నిజాయితీగా ఉద్యమం చేస్తున్న మంద కృష్ణ మాదిగ గురించి . పూటకో పార్టీ మారే రేవంత్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చెయ్యటం సిగ్గు చేటని అన్నారు. ఎస్సీల వర్గీకరణ పట్ల కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్త శుద్ధి ఉంటే రాహుల్ గాంధీ తో మల్లికార్జున్ కార్గే తో ఎస్సీల వర్గీకరణ చెయ్యాలని బీజేపీ కి లేఖలు రాపించలని డిమాండ్ చేశారు , రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో మాలలకు పదవులు ఇస్తు మాదిగలను కాంగ్రెస్ పార్టీకి దూరం చేస్తూ మాదిగలకు పార్టీలో పదవులు ఇవ్వకుండా మాదిగల ఆత్మ గౌరవం దెబ్బ తీస్తున్నాడని విమర్శించారు. ఎస్సీల వర్గీకరణ పట్ల రేవంత్ రెడ్డి కి చిత్త శుద్ధి ఉంటే పార్లమెంట్ సభ్యునిగా ఉంటూ వర్గీకరణ పైన ఒక్క మాట మాట్లాడకపోవడం వర్గీకరణ పైన రేవంత్ రెడ్డికి చిత్త శుద్ధి లేదనే విషయం తేట తెల్లం అయిందని అన్నారు. మంద కృష్ణ మాదిగ ఒక వ్యక్తి కాదు మహాజన శక్తి దళితుల హక్కుల కోసం మాదిగల ఆత్మగౌరం కోసం సమాజంలో బడుగు బలహీన వర్గాల కోసం మానవత దృక్పథంతో ఎవరికైన అన్యాయం జరిగిన ప్రశ్నిస్తాడు అని చెప్పాడు . రేవంత్ రెడ్డితన నోటితోనే ఎన్నో వేదికల మీద చెప్పిన మాటలు ఆయన తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయ్యాక పదవి మత్తులో అహంకారం పెరిగి మరిచిపోయారని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డికి పదవి వ్యామోహం తప్ప తన సొంత రెడ్డి కులానికి కూడా రేవంత్ రెడ్డి చేసింది ఏమీ లేదని గుర్తు చేశారు. మాదిగలను కాంగ్రెస్ పార్టీకి దూరం చేసే కుట్ర చేస్తున్న రేవంత్ రెడ్డినీ దయచేసి కాంగ్రెస్ పెద్దలు సస్పెండ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక ఉద్యమ నమస్సులతో ...దుబ్బ రామకృష్ణ మాదిగ,. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు

# సమీకృత వెజ్,నాన్ వెజ్ మార్కెట్ పనులు సెప్టెంబర్ 5 లోగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ అర్.వి. కర్ణన్**

**నల్గొండ ,సమ సమాజం:** నల్గొండ పట్టణం లో నిర్మిస్తున్న సమీకృత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనులు సెప్టెంబర్ 5 లోగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్దం చేయాలని జిల్లా కలెక్టర్ అర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ పట్టణం లో నిర్మిస్తున్న సమీకృత వెజ్,నాన్ వెజ్ మార్కెట్ పనులు పరిశీలించారు. పెయింటింగ్ పనులు, ముందు ఎలివేషన్, టాయిలెట్ లు, క్యాంటీన్ ఇతర పనులు అన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు. చుట్టూ ప్రహరీ గోడ ఎత్తు పెంచి పెయింటింగ్, గేట్ ఏర్పాటు చేయాలని పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పనులను మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణ చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఐ.టి.టవర్ పక్కన నుంచి పోతున్న డ్రైన్ ఇరు చోట్ల సుమారు 300 మీ.వరకు రైలింగ్, ఫుట్ పాత్,చెట్లు, ఏర్పాటు చేయాలని,డ్రైన్ లోపల కంప చెట్లు తొలగించాలని, టవర్ భవనం పక్క వైపు రహదారి తర్వాత ఫుట్ పాత్,డ్రైన్ వరకు రైలింగ్ మధ్యన ల్యాండ్ స్కేప్ ,సీటింగ్,లైటింగ్ ,చెట్లు పెట్టీ సుందరంగా రూపొందించాలని , పనులు సెప్టెంబర్ 5 లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ డా.కె.వి.రమణా చారి,ప్రజారోగ్య శాఖ ఈ ఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నేషనల్ హెల్త్ మిషన్ స్కీం ఉద్యోగులు అందరిని రెగ్యులర్ చేయాలి

**▸▸ ఎన్.హెచ్.ఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.నరసింహ, ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా డిమాండ్**

**హైదరాబాద్ ,సమ సమాజం:** నేషనల్ హెల్త్ మిషన్ లో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల స్కీం ఉద్యోగులు అందరిని ఎటువంటి షరతులు లేకుండా పర్మినెంట్ చేయాలని రాష్ట్ర ప్రెసిడెంట్ ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సత్యనారాయణ రెడ్డి భవన్ లో జరిగిన అన్ని క్యాడర్ల స్కీం ఉద్యోగులు సమావేశం లో అయన ముఖ్య అతిధి గా పాల్గొని మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో నడుస్తున్న ఎన్.ఏచ్.ఎం.అన్ని క్యాడర్లు పూర్తిస్థాయిలో అన్ని కార్యక్రమాల లో పాల్గొని వాటిని విజయవంతం చేస్తున్నారన్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో సమాంతరంగా పనిచేస్తున్న వారి జీవితాల్లో మాత్రం భారీ వ్యత్యాసం ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంలో గత 23 సంవత్సరాల నుండి కాంట్రాక్ట్ బేసిక్ గా పని చేస్తున్నా కానీ ఇంతవరకు బేసిక్ పే, సమాన పనికి సమాన వేతనం ఇవ్వలేదు అన్ని చెప్పారు. ఆగష్టు 31 నుంచి సమ్మె చేస్తామని అన్ని కమీషనర్ ఆఫీస్ లలో వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్.హెచ్.ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేష్ ఖన్నా, ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ డీ.బాపు యాదవ్, పరశు రాముడు, శ్రీనివాస్, నాగార్జున, సుమన్, నర్సింహా, ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

# సంపద వనాలు ప్లాంటేషన్ త్వరగా చేయాలి

**జిల్లా కలెక్టర్ అర్.వి.కర్ణన్**



**నార్కట్ పల్లి ఆగస్ట్ 17: సమ సమాజం:** నార్కట్ పల్లి మండలం కొండ పాక గూడెం గ్రామం లో ఇరిగేషన్ భూమి లో సంపద వనం కింద ప్లాంటేషన్ పనులు త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అర్.వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టర్ అర్.వి. కర్ణన్ కొండ పాక గూడెం లో సంపద వనం ఏర్పాటుకు గుర్తించిన ప్రాంతం లో భూమి చదును పనులు పరిశీలించారు.మండలం లో ఎల్లారెడ్డి గూడ గ్రామం లో కూడా సంపద వనం తో పాటు,కొండ పాక గూడెంలో రెండు ఎకరాల 30 గంటల భూమి లో సంపద వనాలు ఏర్పాటు చేయనున్నట్లు, వేప,అల్ల నేరేడు,పండ్ల మొక్కలను ప్లాంటేషన్ చేయ నున్నట్లు అధికారులు తెలిపారు. సంపద వనం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ వెంట ఎం.పి.డి. ఓ యాద గిరి,ఎఫ్.అర్. ఓ బాచి రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డ్రోన్ తో పురుగు మందు పిచికారీ పరిశీలించిన కలెక్టర్ తొలుత షేరి బావి గూడెం లో శంకర్ రెడ్డి అనే రైతు పొలం లో డ్రోన్ ద్వారా వరి పై పురుగు మందు పిచికారీ చేయడం మార్గ మద్యం లో కలెక్టర్ గమనించి రైతు ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఒక ఎకరం 500 రూ.లు తీసుకుంటున్నట్లు,5 ని.లలో పని పూర్తి అవుతుందని,లేబర్ ద్వారా చేసే 600 చెల్లించాలి సమయం గంట పడుతుందని తెలిపారు.

# సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం.



**మహేశ్వరం ఆగస్టు 17/సమ సమాజం:**బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని 24వ డివిజన్ లోని ఏపీ ఆర్ ఆర్ కాలనిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించిన .బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి , డీఈఈ జ్యోతి రెడ్డి తదితరులు.

# మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి జిల్లా కలెక్టర్



**యాదాద్రి ,సమ సమాజం:** వలిగొండ : హరితహారంలో భాగంగా ప్రతిఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలకేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాస్ ప్లాంటేషన్ లో భాగంగ నాటిన మొక్కలను పరిశీలించారు. మాస్ ప్లాంటేషన్ లో ప్రతి గ్రామానికి 750 మొక్కల చొప్పున పంపిణి చేయాలని అధికారులకు సూచించారు.మండలకేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం సందర్శించి ధరణిలోని అవకతవకలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని, ఓటరునమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సుచించారు. అనంతరం మండలంలోని నాగారం గ్రామపంచాయతి కార్యాలయంలో కొనసాగుతున్న గృహాలక్ష్మి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పరిశీలించారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతిఒక్కరు తీసుకోవాలి అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడివో గీతా రెడ్డి,తహశీల్దార్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ తీగల కిష్టయ్య,ఆర్ ఐ రాజేష్,విక్రమ్,నాగార్జున, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహేశ్వరం నియోజకవర్గం లో 30 పడకల ఆసుపత్రి ప్రారంభోత్సవం.



**మహేశ్వరం,సమ సమాజం:**మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో నూతనంగా 4 కోట్ల రూపాయలతో నిర్మించిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ప్రారంభించిన వైద్య,విద్యా శాఖ మంత్రులు హరీష్ రావు ,సబితా ఇంద్రారెడ్డి.

అనంతరం మహేశ్వరం గడికోట సమీపంలో జరిగిన భారీ బహిరంగ సభలో మంత్రులు ప్రసంగించారు... ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ అనిత రెడ్డి , ఎమ్మెల్సీ మధుసూధనా చారి ,రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవి చంద్ర గారు,యువ నేత కార్తీక్ రెడ్డి ,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గంజాయి పుష్ప

(మొదటి పేజీ తరువాయి)

లేక ప్రజా ప్రతినిధో అనుకుంటున్నారా? కాదు.. అతడో గంజాయి స్మగ్లర్. తక్కువ ధరకు లభించే డ్రగ్‌గా గుర్తింపు పొందిన గంజాయిని ఇక్కడి నుంచి మహారాష్ట్రకు సరఫరా చేస్తూ కోట్లకు పడగలెత్తాడు. తన దందాపై పోలీసులకు, అధికారులకు... వాహనాల తనిఖీలు జరిగే చెక్‌పాయింట్లు, టోల్‌గేట్ల సిబ్బందికి అనుమానం రాకుండా 'పుష్ప' సినిమాలో అల్లు అర్జున్ రేంజిలో ప్లాన్ వేశాడతడు! టాటా హెక్సా, ఎంజీ హెక్టర్, హ్యుండయ్ వెర్నా, ఫార్చ్యూనర్, ఇన్నోవా, క్రిస్టా వంటి ఖరీదైన కార్లలో ప్రత్యేకంగా అరలు తయారు చేయించి.. వాటిలో గంజాయి సర్ది మహారాష్ట్రకు సరఫరా చేస్తున్నాడు. దీంతో స్మగ్లర్ వెంకన్న సంపాదనకు హద్దు లేకుండా పోతోంది. మహారాష్ట్రలో ఓ డీలర్‌తో వ్యాపార సంబంధాలు పెంచుకుని.. ఇక్కడ వ్యాపారాల్లో కూడా పెట్టుబడులు పెట్టాడు. అయితే, అతడి నేరచరిత్ర గురించి ఉప్పందడంతో తెలంగాణ స్టేట్ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో(టీఎసన్యాబ్) అధికారులు లంగర్‌హౌజ్ పోలీసులతో కలిసి వల వేసి అతణ్ని పట్టుకున్నారు. వెంకన్నతో పాటు గంజాయి దందాలో అతనికి సహకరించిన మరో ఐదుగురిని కూడా టీఎసన్యాబ్ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 44 కేజీల గంజాయి, నాలుగు భారీ కార్లు, రూ.12 లక్షల నగదు మొత్తం రూ. కోటి విలువైన సామాగ్రి స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడించారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం, ఏపూరు గ్రామానికి చెందిన వంకుడోత్ వెంకన్న(33) అలియాస్ వీరు 2006లో పదో తరగతి పరీక్షల్లో తప్పాడు. ఆ తర్వాత నగరానికి వచ్చి.. ఓయూ హాస్టల్లో వరసకు సోదరుడి గదిలో ఉంటూ 2009లో ఎస్ఎసీ పూర్తి చేశాడు.

2013లో అన్నమాచార్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెసలో ట్రిపుల్ ఈ డిప్లొమా పూర్తి చేశాడు. ఆ సమయంలో సూర్యాపేటలో నివాసం ఉండే తన మేనమామ తేజావత్ చందా (70) వద్దకు తరచూ వెళ్తుండేవాడు. చందా అప్పటికే గంజాయి సరఫరా వ్యాపారంలో ఉండటం.. ఈజీగా డబ్బులు సంపాదించడం చూసి వెంకన్న కూడా గంజాయి దందా మొదలు పెట్టాడు. ఖరీదైన కార్ల సీట్ల కింద, బాడీకి పైన చిన్నచిన్న అరలు తయారుచేయించాడు. ఆటోనగర్‌లోని ఓ వెల్డింగ్ షాపు వద్దకు ఆ కార్లను తీసుకెళ్లి.. సీట్ల కింద.. బాడీకిపైన చిన్న చిన్న అరలు తయారు చేయించాడు. ఆ కార్లను నడిపేందుకు డ్రైవర్లను నియమించుకున్నాడు.

విశాఖపట్నం నుంచి ప్రతి ట్రిప్పులో కారులో 100 కేజీల గంజాయి.. 10 కేజీలు.. 5 కేజీల చిన్న చిన్న ప్యాకెట్లలో పెట్టి వాటిని కార్ల అరల కింద అమర్చి దర్జాగా తీసుకొచ్చేస్తాడు. అలా వారంలో రెండు సార్లు విశాఖ నుంచి గంజాయి తరలిస్తుంటాడని పోలీస్ విచారణలో వెల్లడైంది. ఈ దందాలో అతనికి సహకరించిన ఇద్దరు డ్రైవర్లు మహబూబాబాద్ జిల్లాకు చెందిన అజ్మీర వెంకన్న (21), సుర్మేని మనోజ్ (20)తో పాటు, మరో ఇద్దరు వ్యాపారులు మెరుగు మధు (39, మహబూబాబాద్ జిల్లా), మహమ్మద్ జహంగీర్ (40, మహబూబ్‌నగర్ టౌన్)ను అరెస్టు చేశారు.

# రైతు బంధు పక్కదారి!

(మొదటి పేజీ తరువాయి)

కొందరు దళారులు పాత్రధారులుగా మారి.. నల్లగొండ జిల్లా చందంపేట మండలం ముడుదంట్లలో మూడేళ్లుగా 'రైతు బంధు' పథకం సొమ్మును దారి మళ్లించిన బాగోతం తాజాగా వెలుగులోకి వచ్చింది.

**చనిపోయారని తెలిస్తే.. ఖాతా మార్చేస్తూ..**

సాధారణంగా భూములు ఎవరి పేరిట ఉంటే వారికి సంబంధించిన బ్యాంకు ఖాతాలో రైతు బంధు సొమ్మును ప్రభుత్వం జమ చేస్తుంది. కుటుంబంలో భూమి తమ పేరిట ఉన్న వ్యక్తులు చనిపోతే.. వారసులు ఆ భూమిని తమ పేరున పట్టా చేయించుకొని, రైతు బంధుకు దరఖాస్తు చేసుకుంటారు. అధికారులు ఆ దరఖాస్తులను పరిశీలించి చనిపోయిన వ్యక్తి స్థానంలో వారసుల పేరు, బ్యాంకు ఖాతా నంబర్‌ను లింక్ చేస్తారు. దాంతో వారి ఖాతాల్లో రైతు బంధు సొమ్ము జమ అవుతుంది. కానీ చందంపేట మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు, కొందరు దళారులు కలసి అక్రమాలకు పాల్పడ్డారు. చనిపోయిన వారి భూముల వివరాలకు దళారుల బ్యాంకు ఖాతా నంబర్లను అనుసంధానం చేశారు. ఆ ఖాతాల్లో పడిన లక్షల రూపాయల సొమ్మును పంచుకున్నారు. మూడేళ్లుగా ఈ అక్రమాలు కొనసాగుతూనే ఉన్నాయి.

# గిరిజన మహిళపై థర్డ్‌డిగ్రీ..

నాగోలు: ఒంటరిగా ఉన్న ఓ గిరిజన మహిళను అనుమానించారు. అంతటితో ఆగకుండా బలవంతంగా అర్ధరాత్రివేళ స్టేషన్‌కు తీసుకెళ్లారు. రాత్రంతా స్టేషన్‌లో నిర్బంధించి లాఠీలు, బూటు కాళ్లతో తంతూ చిత్రహింసలకు గురి చేశారు. ఈ ఘటన ఎల్‌బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరగ్గా, ఆలస్యంగా వెలుగుచూసింది. వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడమటిపల్లితండాకు చెందిన వడిత్యా లక్ష్మి, భర్త శ్రీను చనిపోవడంతో ముగ్గురు పిల్లలతో మీర్‌పేటలోని నందిహిల్స్‌కు వచ్చింది.

స్థానికంగా ఇళ్లలో పనికి కుదిరి ఇక్కడే నివాసముంటోంది. ఇటీవల లక్ష్మి పెద్ద కూతురుకు పెళ్లి సంబంధం కుదిరింది. ఎంగేజ్‌మెంట్ కూడా అయ్యింది. ఈనెల 30న పెళ్లి ముహూర్తం పెట్టుకున్నారు. పెళ్లి ఖర్చుల కోసమని దేవరకొండలోని బంధువుల ఇంటికి ఈ నెల 15వ తేదీన వెళ్లింది. వారి వద్ద రూ.3లక్షల నగదు అప్పుగా తీసుకుంది. అక్కడి నుంచి ఎల్‌బీనగర్‌కు బస్సులో వచ్చింది. అప్పటికే అర్ధరాత్రి అయ్యింది. మీర్‌పేటకు వెళ్లేందుకు ఆటోలు, బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఎల్‌బీనగర్ చౌరస్తాలో రోడ్డు పక్కన లక్ష్మి నిలబడింది. అదే సమయంలో పెట్రోలింగ్ వాహనం ఆమె వద్దకు వచ్చి ఆగింది. ఎక్కడకు వెళుతున్నావు...చేతిలో డబ్బు ఎక్కడిదని పోలీసులు గట్టిగా ప్రశ్నించారు. ఊరి నుంచి వస్తున్నానని, ఆటో కోసం ఎదురుచూస్తున్నానని చెప్పినా పోలీసులు వినలేదు. కూతురు పెళ్లికార్డు చూపించినా పట్టించుకోలేదు. అర్ధరాత్రి వేళ లక్ష్మిని ఎల్‌బీనగర్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ క్రమంలో లక్ష్మికి పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులకే ఎదురు మాట్లాడతావా అంటూ లక్ష్మిపై హెడ్ కానిస్టేబుల్ శివశంకర్, మహిళా కానిస్టేబుల్ సుమలత, మరో ఇద్దరు సిబ్బంది లాఠీలు, బూటు కాళ్లతో దాడి చేశారు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బుధవారం ఉదయం ఆటోలో పోలీసులు లక్ష్మిని ఇంటికి పంపించారు. లక్ష్మి నడవలేని పరిస్థితిని గమనించిన ఆమె కుటుంబసభ్యులు స్థానిక వైద్యుడిని ఇంటికి పిలిపించి వైద్యం లక్ష్మి కూతురు వడ్త్యా పూజ ఫిర్యాదు మేరకు దాడి చేసిన పోలీసులపై ఎల్‌బీనగర్ స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదైంది.

# ఆర్టీసీ బిల్లు.. మళ్లీ లొల్లి

(మొదటి పేజీ తరువాయి)




సమాచారం ఇచ్చే వరకు బిల్లులు పెండింగ్‌లో ఉంచుకునే విషయంలో రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని పూర్తిగావినియోగించుకుంటున్నారు. అదే సమయంలో తాను లేవనెత్తిన సందేహాలన్నీ ప్రభుత్వం విధిగా శాసనసభ, శాసనమండలి సభ్యుల దృష్టికి తీసుకెళ్లిందా? లేదా? అనే అంశాన్ని కూడా రాజ్యాంగంలోని ఆర్టికల్ 175(2) ద్వారా తనకు లభించిన అధికారాన్ని ఉపయోగించి, అసెంబ్లీ స్పీకర్, కౌన్సిల్ ఛైర్మన్‌లను అడిగి తెలుసుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో సభ ఆమోదం తెలిపి తన వద్దకు పంపిన టీఎసఆర్టీసీ ఉద్యోగుల విలీనం బిల్లుపై కూడా తాజాగా గవర్నర్ న్యాయ సలహాను కోరారు. ఆర్టీసీ బిల్లుతో పాటు ఇటీవల ముగిసిన అసెంబ్లీ సమావేశాల్లో మరోసారి ఆమోదం తెలిపి పంపిన నాలుగు బిల్లుల్ని గవర్నర్ న్యాయశాఖ కార్యదర్శికి పంపారు. గవర్నర్ గతంలో వెనక్కి పంపినపుడు ఆ 4 బిల్లులపై చేసిన సిఫార్సులపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశం గురించి కూడా గవర్నర్ అడిగారు. ఆర్టీసీ బిల్లుతో సహా ఇతర బిల్లుల విషయంలో తాను చేసిన సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్నారా? లేదా? నిర్ధారించాలని కోరారు. న్యాయశాఖ కార్యదర్శి నుంచి అందే సమాచారం ఆధారంగా బిల్లులపై గవర్నర్ తదుపరి చర్యలు తీసుకోనున్నారు. రాజకీయ దురుద్దేశంతో బిల్లుల విషయంలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ఆర్టీసీ ఉద్యోగులు, ప్రజలు నమ్మవద్దని గవర్నర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాజ్‌భవన్ వర్గాలు గురువారం ఒక ప్రకటన విడుదల చేశాయి.

**ఆర్టీసీ బిల్లు విషయంలో అదే పట్టు**

ఆర్టీసీ కార్మికుల భవిష్యత్తు, విలువైన ఆర్టీసీ ఆస్తులకు సంబంధించిన అంశం కావడంతో ఈ బిల్లు విషయంలో గవర్నర్ పక్కాగా ఉన్నారు. గవర్నర్ పది రోజుల క్రితం పుదుచ్చేరి పర్యటనలో ఉన్న సమయంలో ఆర్టీసీ బిల్లును ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపింది. ఆర్టీసీ బిల్లు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉందనే ప్రచారం జరగడంతో ఆర్టీసీ సంఘాలు రాజ్‌భవన్ ముట్టడికి పిలుపునిచ్చాయి. అసెంబ్లీ సమావేశాలు జరుగుతుండటం, ఆర్టీసీ సంఘాల ముట్టడి నేపథ్యంలో గవర్నర్ వెంటనే స్పందించి ఆర్టీసీ సంఘాల నాయకుల్ని రాజ్‌భవన్‌కు ఆహ్వానించి ఆన్‌లైన్ సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీ బిల్లుపై తనకు ఉన్న సందేహాల్ని నివృత్తి చేసుకోవడంతో పాటు గవర్నర్ ప్రభుత్వానికి పలు సూచనలు చేశారు. ఆ తర్వాత పుదుచ్చేరి పర్యటన నుంచి అర్ధంతరంగా హైదరాబాద్ వచ్చిన తమిళిసై ఆర్టీసీ బిల్లుకు ఆమోదం తెలిపి అసెంబ్లీకి పంపించారు. అదే రోజు తిరిగి పుదుచ్చేరి వెళ్లిపోయారు. సభలో ఆమోదం లభించి,గవర్నర్ వద్దకు వచ్చిన తర్వాత మరో సారి న్యాయసలహాకు పంపించారు.

ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లుపై సంతకం పెట్టేందుకు గవర్నర్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నట్లు ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వ్యాఖ్యానించారు. ఇది 43 వేల మంది ఉద్యోగులు, కార్మికుల కుటుంబాలను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా మార్గదర్శకాల రూపకల్పనలో ఆర్టీసీ యూనియన్‌లకు భాగస్వామ్యం కల్పించాలని కోరారు.

# అధికారం ఇచ్చినా ఏమీ చేయని అసమర్థులు

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీ రామారావు పార్టీ కేడర్‌కు పిలుపునిచ్చారు. తెలంగాణ భవన్‌లో గురువారం మంత్రి సమక్షంలో కాంగ్రెస్ నేత డాక్టర్ తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా ఉన్న తెల్లం వెంకట్రావు, నెల రోజుల క్రితం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాగా, గురువారం తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన వెంకట్రావుకు, మంత్రి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీతో వెళ్లడం అంటే కుక్కతోకను పట్టుకుని గోదావరి ఈదినట్లే అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'బీఆర్ఎస్ పార్టీకి మహారాష్ట్రలో అపార ఆదరణ లభిస్తోంది. రోజుకో పార్టీ విలీనంతో జాతీయ స్థాయిలో కేసీఆర్ శక్తిమంతమైన నేతగా ఎదుగుతున్నారు. బీఆర్ఎస్‌కు జాతీయ స్థాయిలో పునాది పడాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో 90 నుంచి 95 సీట్లు ఇవ్వడం ద్వారా మన నాయకుడికి కొత్త శక్తి, ఉత్సాహం ఇవ్వాలి. ఇక్కడి తీర్పు మహారాష్ట్రలో ప్రతిధ్వనించేలా మీ నిర్ణయం ఉండాలి. రేపటి రోజున కేంద్రంలో మనం లేకుండా ఎవరూ ప్రధాన మంత్రి అయ్యే పరిస్థితి ఉండదు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలు గెలిచేలా మద్దతు ఇవ్వండి'అని కేటీఆర్ పిలుపునిచ్చారు. గిరిజన పోరాట యోధుడు కొమురం భీం కోరుకున్న జల్ జంగల్ జమీన్ నినాదం స్ఫూర్తితో తెలంగాణ ప్రభుత్వం ముందుకు వెళుతోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణ కోటి ఎకరాల మాగాణంగా కేసీఆర్‌తోనే సాధ్యమైందని, పొరుగున ఉన్న కాంగ్రెస్ పాలిత రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో మిషన్ భగీరథ, పోడు భూములకు పట్టాలు, రైతుబీమా, ధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్ వంటి కార్యక్రమాలు ఎందుకు అమలు కావడం లేదని ప్రశ్నించారు.

# కాంగ్రెస్‌లోనే ఉన్నా.. ఇకపై ఉంటా!

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నేత నాగం జనార్దన్ రెడ్డి సొంత పార్టీ నేతపైనే విమర్శలు గుప్పించారు. ఇటీవల కాంగ్రెసలో చేరిన జూపల్లి కృష్ణారావు తీరుపై మండిపడ్డారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిపై పలు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెసలోనే తాను ఉన్నానని.. ఇకపై ఉంటానని తేల్చి చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నాగం తన అనుచరులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఐదేళ్లలో అన్ని ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేశా, పార్టీని కాపాడా.. జూపల్లి, దామోదర్ ఇప్పుడొచ్చి టికెట్ నాదే అంటున్నారు. కొల్లాపూర్, వనపర్తి, గద్వాల్, నాగర్ కర్నూల్ నియోజకవర్గాల్లో ఆయన సూచించిన వారికే టికెట్లు ఇవ్వాలని ఓ నాయకుడు అంటున్నారు. పార్టీలో కాకున్నా.. రాష్ట్ర రాజకీయాల్లో నేను సీనియర్ నాయకుడిని, పార్టీ ఆదుకోకపోతే ఊరుకోం. టికెట్ కోసం ఎప్పుడూ దరఖాస్తు చేసుకోలేదు. అందరూ చేసుకుంటే నేను చేస్తా.. దామోదర్ ఇంకా పార్టీలోకే రాలేదు. ఆయనకు టికెటిస్తే గెలిచాక బీఆర్ఎసలోకి వెళ్లబోరని ఏంటి గ్యారెంటీ" అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అవినీతి విపరీతంగా పెరిగిపోయిందని, దీన్ని అరికట్టాల్సిన సీఎం కేసీఆర్ అన్నింటినీ గాలికొదిలేశారని నాగం ఆరోపించారు. దేశంలోనే అతి పెద్ద కుంభకోణం కాళేశ్వరం ప్రాజెక్టు అని, దీనికి పూర్తి బాధ్యత కేసీఆర్‌దేనన్నారు. కాగ్ నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో పెట్టాల్సింది పోయి.. పక్కకు పెట్టారన్నారు. 40 శాతం అవినీతి ఉందని కర్ణాటకలో ప్రచారం చేసి, అక్కడ అధికారంలోకి వచ్చామని, ఇక్కడ 70 నుంచి 75 శాతం అవినీతి జరుగుతోందని.. దాని సంగతి తేల్చాలి" అని డిమాండ్ చేశారు.

# ఉన్నత విద్యలో 'గేమ్ చేంజర్'

(మొదటి పేజీ తరువాయి)

నేర్చుకునే అవకాశం మన విద్యార్థులకు దక్కుతుందన్నారు. విదేశాలకు వెళ్లి చదువుకోలేని ఎంతో మంది విద్యార్థులకు ప్రపంచ ప్రసిద్ధి చెందిన వర్సిటీలు రూపొందించిన కోర్సులను సులభంగా నేర్చుకునే అవకాశం లభిస్తుందన్నారు. సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

**మెరుగైన ఉపాధి, ఉద్యోగాలు**

రాష్ట్రంలో ఉన్నత విద్య అభ్యసిస్తున్న ప్రతి విద్యార్థికి అంతర్జాతీయ వర్సిటీల కోర్సులను ఉచితంగా నేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాం. ఈ కోర్సులు చేసిన విద్యార్థులకు హార్వర్డ్, ఎంఐటీ, కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్ వంటి వర్సిటీలతో ఎడెక్స్ సంయుక్త సర్టిఫికేషన్ లభిస్తుంది. ఇది మన విద్యార్థుల ఉపాధి, ఉద్యోగ అవకాశాలను మరింత మెరుగుపరుస్తుంది. ముఖ్యంగా దేశంలో అందుబాటులో లేని ఎన్నో కోర్సులను ఎడెక్స్ అందిస్తుంది. వివిధ కోర్సులకు సంబంధించి అందుబాటులో లేని బోధనా సిబ్బంది కొరతను దీని ద్వారా అధిగమించవచ్చు. ఇంజనీరింగ్, మెడిసిన్ లాంటి కోర్సులతో పాటు ఆర్ట్స్, కామర్స్‌లో పలు రకాల సబ్జెక్టులకు చెందిన కోర్సులను ఎడెక్స్‌తో ఒప్పందం ద్వారా అందుబాటులోకి తెస్తున్నాం. ఇది ఉన్నత విద్యలో గొప్ప మార్పులకు దారితీస్తుంది. ఈ క్రమంలో ఉన్నత విద్య సిలబస్‌ను పూర్తిస్థాయిలో పునఃపరిశీలన చేసి అన్ని విభాగాల్లోని కోర్సులను రీ డిజైన్ చేయాలి. ఆధునికతను అందిపుచ్చుకుంటూ నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా కోర్సులను తీర్చిదిద్దాలి. కోర్సుల్లో ఎక్కువ వర్టికల్స్ పెట్టాలి. తద్వారా విద్యార్థి తనకు కావాల్సిన వర్టికల్‌ను చదువుకునే అవకాశం ఇవ్వాలి. ఇప్పుడున్న ప్రతి కోర్సునూ, అందులో ఉన్న సబ్జెక్టులను పూర్తిగా మార్పు చేయాలి. ఇందుకోసం ప్రత్యేకంగా బోర్డు ఏర్పాటు చేద్దాం.

**సీఎం జగన్ విజన్ గొప్పది**

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజన్ చాలా గొప్పది. విదేశాలకు వెళ్లి చదువుకోలేని పేద విద్యార్థుల కోసం ప్రపంచం మెచ్చిన అత్యుత్తమ వర్సిటీల నుంచి ఉత్తమ కోర్సులను, నిపుణులైన అధ్యాపకులతో బోధన అందించాలని తపిస్తున్నారు. టెక్నాలజీతో కూడిన విద్య అందించడం ద్వారానే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని దూరదృష్టితో గుర్తించారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్య అందించాలనే సంకల్పంతో ఎడెక్స్‌ను ఆహ్వానించారు. ఈ ఒప్పందం ద్వారా ఏపీ విద్యార్థులు దాదాపు వెయ్యికి పైగా కోర్సులను ఆర్ట్స్, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్‌లెర్నింగ్, లా, సైకాలజీ, బయాలజీ, మెడిసిన్ లాంటి అనేక విభాగాల్లో చదువుకోవచ్చు. ఆధునికతకు తగ్గట్టుగా పాఠ్యాంశాల రూపకల్పన, కొత్త సాంకేతిక నిపుణులను సృష్టించడం, ఇప్పటికే ఉన్న కోర్సుల పునరుద్ధరణ, రీ స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ తదితర అంశాలపై ఏపీతో కలసి పనిచేస్తాం. ఎడెక్స్ ద్వారా టాప్ వర్సిటీల్లో కోర్సులు పూర్తి చేసిన వారికి సర్టిఫికేషన్ లభిస్తుంది. 'ఎడెక్స్' ప్రపంచంలో ప్రముఖ ఈ-లెర్నింగ్ ప్లాట్ ఫారమ్. ఇది 170కిపైగా టాప్ ర్యాంకింగ్ విద్యా సంస్థల నుంచి ఆన్‌లైన్ కోర్సులను అందిస్తోంది. ఇందులో 37 టాప్ 50 విశ్వవిద్యాలయాలున్నాయి.

# జాబిల్లికి చేరువగా విక్రమ్ ల్యాండం

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించింది. దీంతో విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన ల్యాండర్ మాడ్యూల్‌ను చంద్రుని ఉపరితలంపై దించడానికి రంగం సిద్ధమైందని తెలిపింది. ప్రస్తుతం 153 కి.మీ-163 కి.మీ స్వల్ప దీర్ఘ వృత్తాకార కక్ష్యలో తిరుగుతున్న ల్యాండర్‌ను ఈ నెల 23న సాయంత్రం 5:47 గంటలకు చంద్రుడి దక్షిణ ధృవ ప్రాంతంలో దించేందుకు ఇస్రో కసరత్తు చేస్తోంది.

**థాంక్స్ ఫర్ ది రైడ్ మిత్రమా...**

ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి విడిపోయిన తర్వాత ల్యాండర్ మాడ్యూల్ పంపించిన సందేశాన్ని బెంగళూరులోని ఇస్రో కేంద్రం అందుకొంది. ల్యాండర్ మాడ్యూల్ 'థాంక్స్ ఫర్ ది రైడ్ మేట్..' అనే సందేశాన్ని పంపిందని ఇస్రో పేర్కొంది. భారత కాలమానం ప్రకారం శుక్రవారం సాయంత్ర 4 గంటలకు ల్యాండర్‌కు డీ-ఆర్బిట్-1 (వేగాన్ని తగ్గించే ప్రక్రియ) ప్రక్రియ చేపట్టి దాన్ని చంద్రునికి 30 కి.మీ దగ్గరగా 100 కి.మీ దూరంగా ఉండే తక్కువ కక్ష్యలోకి ప్రవేశపెడతామని ఇస్రో ట్వీట్ చేసింది. అనంతరం ఈ నెల 19న, 21న ల్యాండర్‌లో ఉండే ఇంధనాన్ని మండించి బెంగళూరులోని ఉపగ్రహ నియంత్రణ కేంద్రం నుంచి రెండు కీలక ఆపరేషన్లు చేపట్టి ల్యాండర్ వేగాన్ని క్రమంగా తగ్గించనున్నారు. ఈ క్రమంలో ల్యాండర్ ఈ నెల 23న చంద్రుని దక్షిణ ధ్రువానికి చేరువలో సుమారు 70 డిగ్రీల దక్షిణ అక్షాంశం వద్ద దిగేలా నిర్దేశించారు. జాబిల్లిని తాకే సమయంలో ల్యాండర్ నిలువు వేగాన్ని సెకనుకు 2 మీటర్లుగా ఉండేలా చర్యలు చేపట్టనున్నారు.

**చంద్ర కక్ష్యలోనే ప్రొపల్షన్ మాడ్యూల్**

ప్రొపల్షన్ మాడ్యూల్ నుంచి ల్యాండర్ మాడ్యూల్ గురువారం విడిపోయింది. విడిపోయిన ల్యాండర్ చంద్రుని ఉపరితలంపై దిగుతుంది. ఈ ప్రొపల్షన్ మాడ్యూల్ మాత్రం ప్రస్తుతం ఉన్న కక్ష్యలోనే తన ప్రయాణాన్ని నెలలు/కొన్నేళ్లపాటు కొనసాగిస్తుందని ఇస్రో వెల్లడించింది. ఈ ప్రొపల్షన్ మాడ్యూల్‌లోని 'షేప్' (స్పెక్ట్రో-పోలారిమెట్రీ ఆఫ్ హాబిటబుల్ ప్లానెట్ ఎర్త్) పేలోడ్ వాతావరణాన్ని అధ్యయనం చేస్తుందని, సౌర వ్యవస్థ ఆవల నివాసయోగ్యమైన పరిస్థితులను గుర్తించే పనిచేస్తుందని తెలిపింది. చంద్రునిపై అధ్యయనం కోసం జూలై 14న ఇస్రో చంద్రయాన్-3 ప్రయోగాన్ని చేపట్టింది. తొలుత భూ కక్ష్యలో తిరిగిన వ్యోమనౌక ఆగస్టు 5న చంద్ర కక్ష్యలోకి అడుగుపెట్టింది.



## అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించిన బాలెంల సైదులు

**యాదాద్రి భువనగిరి జిల్లా ,సమ సమాజం:** అడ్డగూడూర్ మండల పరిది లోని మంగమ్మగూడెం కు చెందిన డేగల శీను గత కొద్ది రోజులుగా కిడ్నీల సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ప్రజా సేవకులు బాలెంల సైదులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందించి అండగ నిలిచారు.కార్యక్రమంలో రిటైర్డ్ టీచర్ యాదగిరి గారు, గంటా నరేందర్ రెడ్డి, తప్పతీ బీరప్ప,అన్నం వెంకన్న, తుంగపాటి సోమన్న, భయ్య బిక్షం,కందుకూరి ,నరేష్ బండ నరేందర్, డప్పు సురేశ్, డప్పు శ్రీధర్,పోలేపకా ఉపేందర్ , మేకల పవన్,తదితరులు పాల్గొన్నారు.


## 2వ ఏ ఎన్ ఎంల తోపాటు అందరిని ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులర్ చేయాలి

- ఏ ఎన్ ఎం ల నిరవధిక సమ్మెకు పీ ఓ డబ్ల్యూ మద్దతు
- పి ఓ డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సి హెచ్ శిరోమణి, జిల్లా కార్యదర్శి టీ ఝాన్సీ లక్ష్మి మద్దతు



**ఖమ్మం ఆగస్టు 17: సమ సమాజం:** తెలంగాణ రాష్ట్రంలో రెండవ ఏ ఎన్ ఎం తోపాటు, ఈసీ, అర్బన్ ఆర్బిఎస్కె,104 అందరిని ఎలాంటి షరతులు లేకుండా భేషరతుగా రెగ్యులర్ చేయాలని పి ఓ డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి సీ హెచ్ శిరోమణి, ఖమ్మం జిల్లా కార్యదర్శి టీ ఝాన్సీ లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం రోజు నుండి రాష్ట్రవ్యాప్తంగా రెండవ ఏ ఎన్ ఎం ల తోపాటు ఇతర ఉద్యోగులు తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మె నిర్వహించడం జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల ముందు నిరవధిక సమ్మె కొనసాగుతుంది. గత 20 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలు తీసు కుంటూ, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలాంటి పథకాలైన మరియు ప్రజల ఆరోగ్యాలను కాపాడడంలోనూ ప్రతిరోజు 30 రకాలకార్యక్రమాలను ఆన్లైన్ చేస్తూ శ్రమదోపిడికి గురవుతున్నారు.గత అనేక సంవత్సరాల నుంచి సెకండ్ ఏ ఎన్ ఎం తోపాటు,ఈ సి ,అర్బన్, ఆర్ బి ఎస్ కె ,104 తో పాటు వివిధ రకాల ఏ ఎన్ ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పోరాటాలు చేశారని అన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్లు వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో పనిచేస్తున్న కాంట్రాక్టు,ఔట్సోర్సింగ్ ఏఎన్ఎం లను ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు ఈ పోరాటం కొనసాగించాలని పిలుపు ఇస్తున్నాం.

## బీసీ బంధు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు.



**జగిత్యాల, సమ సమాజం:** ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బిసి బంధు చెక్కులు కోరుట్ల శాసనసభ్యులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అందజేశారు.ఈమెరకు 11 గ్రామాలలో సుమారు 40 కుల సంఘాలకు 1 కోటి 50 వేల రూపాయల నిధుల మంజూరు పత్రాలు ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాజల భీమేశ్వరి, జడ్పీటీసీ భారతీ , వైస్ ఎంపిపి లక్ష్మారెడ్డి , పార్టీ అధ్యక్షులు ధశరత్ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, కుల సంఘాల నాయకులు, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి 3లక్షల ఎల్ఓసి ని అందించిన మంత్రి కొప్పుల




**జగిత్యాల, పృధ్వి న్యూస్ :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం వెల్గొండ గ్రామానికి చెందిన చీర్నేని రామచంద్ర కుమార్తె చీర్నేని భూమిని నరాల సంబంధించిన వ్యాధితో బాధపడుతు గతం లో చికిత్స కోసం మంత్రి కొప్పుల ఈశ్వర్ ను కలవగా నిమ్స్ ఆసుపత్రి కి సంబందించిన 2 లక్షల రూపాయల ఎల్ఓసి చెక్కు ను అందించడం జరిగింది. కాగా భూమిక చికిత్స కోసం డబ్బులు సరిపోక తిరిగి చికిత్స కోసం సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ను కలవడం జరిగింది, మంత్రి భూమిక ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని చలించి నాలుగు రోజుల్లో 3లక్షల రూపాయల ఎల్ఓసి ని గురువారం ధర్మపురి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎల్ఓసి చెక్కును అందజేశారు.

# ఉత్తమ ఉద్యోగికి గ్రామస్థుల ఆత్మీయ సన్మానం.

**జగిత్యాల, సమ సమాజం:** విధుల్లో ఉత్తమ సేవలు అందించగా 77వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రభుత్వం ఉత్తమ ఉద్యోగిగా గుర్తించి ప్రశంశా పత్రం అందజేయగా గ్రామంలో ఉన్నత చదువులు చదివి పేరుప్రతిష్టలు సంపాదించిన ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్న ఉద్యోగి దంపతులను గ్రామస్తులు గురువారం ఆత్మీయంగా సన్మానించారు. వివరాల్లోకి వెళితే జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన డొంగరి రాజేందర్ మెట్ పల్లి లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల లో రికార్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తుండగా ఆయనకు ఇటీవల స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగిగా గుర్తింపు లభించింది. కాగా సంగెం గ్రామస్థులు రాజేందర్, లావణ్య దంపతులను గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ నిమిత్తం గ్రామానికి వచ్చిన బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ చేతులమీదుగా శాలువా తో ఘనంగా సన్మానించారు.





### గ్రామ అభివృద్ధి కార్యక్రమాల నిధులు అందజేసిన డాక్టర్ సంజయ్ కుమార్.

కోరుట్ల మండలం సంగెం గ్రామ అభివృద్ధికై ఇటీవల కోరుట్ల ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయగా గురువారం గ్రామానికి వచ్చిన బిఆర్ఎస్ నాయకులు డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కుమార్ గ్రామంలో నిర్మించతలపెట్టిన వైకుంఠధామానికి,సిసి రోడ్డుకు 7 లక్షల రూపాయలు,మురికి కాల్వలకు 5 లక్షల రూపాయలు గ్రామ అభివృద్ధి నిధులకు సంబందించిన ప్రోసిడింగ్ లను గ్రామస్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సంజయ్ వెంట ఎంపీపీ తోట నారాయణ,కోరుట్ల మండల బిఆర్ఎస్ అధ్యక్షులు దారిశెట్టి రాజేష్, జిల్లా రైతుబంధు అధ్యక్షులు చీటి వెంకటరావు, గ్రామ సర్పంచ్ చెప్పాల నరసయ్య, గ్రామ రైతుబంధు అధ్యక్షులు సుదవేణి భూమయ్య, వార్డు మెంబర్లు కల్లూరి దేవయ్య, దోనే రాజు, ప్రశాంత్,లక్ష్మారెడ్డి,సింగిల్ విండో డైరెక్టర్లు జక్కని గణేష్, మోహన్ రెడ్డి , శ్రీను ,బిఆర్ఎస్ నాయకులు శనిగరపు శంకర్, భూమారెడ్డి, గంగారెడ్డి,దామోదర్,శ్రీహరి, సత్యనారాయణ, అరవింద్, సుధా వేణి మహేష్, రవి, మైపాల్, తదితరులు పాల్గొన్నారు.

# ఒంటికాలిపై నిల్చుని ఏఎన్ఎం ల నిరసన పలువురు నేతల సంఘీభావం




**జగిత్యాల,సమ సమాజం:** కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఏఎన్ఎం లను రెగ్యులరైజు చేయాలని కోరుతుంటే ప్రభుత్వం పెడచేవినా పెడుతోందని చెబుతూ మహిళల ఉసురు పోసుకున్న ఏ నాయకుడు బతికి బట్ట కట్టలేదని బిఎస్పీ జగిత్యాల జిల్లా ఇంచార్జి చిర్ర శంకర్ అన్నారు. జగిత్యాల ఆర్డీఓ కార్యాలయం ముందు గురువారం ఏఎన్ఎంలు రెండవ రోజు సమ్మెలో పాల్గొన్నారు. ఏఐటీయూసి అనుబంధంగా ఉన్న రాష్ట్ర ఏఎన్ఎం ల సంఘం ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ ఆధ్వర్యంలో జిల్లాలోని ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఏఎన్ఎం లు పెద్ద ఎత్తున పాల్గొని ఒంటి కాలిపై నిల్చుని నిరసన తెలిపారు.

సమ్మెకు బిఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్బంగా బిఎస్పి నేతలు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం చెప్పుకుంటున్న బంగారు తెలంగాణ కాదని ఇది భ్రమల తెలంగాణ అని ఎద్దేవా చేశారు. వైద్య సిబ్బంది న్యాయమైన సమస్యను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మీకు చేతకాకుంటే రాబోయే రోజుల్లో ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో మేమే చేసి చూపిస్తామని పేర్కొన్నారు. ఏఎన్ఎం లను రెగ్యులరైజు చేసేవరకు వారి వెన్నంటి ఉంటామని చెప్పారు. గాండ్ల మధురిమ మాట్లాడుతూ నోటిఫికేషన్ రద్దు చేసి మా ఉద్యోగలను క్రమబద్ధికరించాలన్నారు. గత కొన్ని నెలల క్రితం ఎంపిహెచ్డబ్ల్యూ మేల్ సిబ్బందిని రెగ్యులరైజ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం మమ్మల్ని ఎందుకు విస్మరించిందని మండిపడ్డారు. కరోనా సమయంలో వృద్ధ తల్లి తండ్రులు, కుటుంబాలను వదిలి, ప్రాణాలను లెక్కచేయకుండా సమాజానికి వైద్య సేవలు అందించామని గుర్తు చేశారు. మహిళలను ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని విమర్శించారు.ఏలాంటి ఆంక్షలు లేకుండా రెగ్యులరైజు చేయాలని అంతవరకు సమ్మె కొనసాగిస్తామని మధురిమ తేల్చి చెప్పారు. అనంతరం కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ని ఏఎన్ఎంలు కలిసి మేము చేస్తున్న సమ్మెకు మద్దతు తెలుపాలని మధురిమ ఆధ్వర్యంలో ఏఎన్ఎం లు కోరారు. కార్యక్రమంలో నీరజ, పద్మ, శిరీష, పి. శిరీష, ఉజ్వల, రజిత, స్వరూప, జమున, ప్రమీల, శారద, మేరీ, ఎలిజబెత్ రాణి,రాజేశ్వరి, కోమల, సరోజ, చిలుకమ్మా, జ్యోతి, బిఎస్పీ నాయకులు ముజహీద్, బొల్లంపల్లి సతీష్ కుమార్ ,తోట మహేందర్, వెంకటేష్, పొనగంటి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి




జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్

### మెట్ పల్లి పట్టణంలో పోలీసులచే యువత కు అవగాహన కార్యక్రమం.

**జగిత్యాల,సమ సమాజం:** యువత పైన దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా అలవర్చుకోవాలని జగిత్యాల జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు.జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణ శివారులో గల ఫంక్షన్ హాల్లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గురువారం యువత – మంచి భవిత అనే కార్యక్రమంలో సేనోటూ డ్రగ్స్ , క్రైమ్, ర్యాగింగ్, ట్రాఫిక్ వైలేషన్, సైబర్ అబ్యూజ్ అండ్ మిస్యూజ్ అనే ఐదు అంశాలపై యువతకు అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత లక్షలను సాధించాలన్నారు. మత్తు పదార్థాలకు మానసికంగా బానిస కావడం ద్వారా అనుకోకుండా క్రైమ్ చేసే అవకాశం ఉందని అన్నారు. అనుకోకుండా ఏదైనా క్రైం చేసినట్లయితే ఎలాంటి ఉద్యోగం కూడా రాదని కావున డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి సత్ప్రవర్తనతో ఉన్నత లక్ష్యాలను సాధించి ధైర్యంతో ముందుకు వెళ్లాలని ఎస్పీ భాస్కర్ సూచించారు.ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో యువత పోటీ తత్వంతో ఉండాలని నేటి యువత పై దేశ అభివృద్ధి ఆధారపడి వుంటుందని అన్నారు. యువత చెడు అలవాట్లు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సామాజిక మధ్యమాలైన ఫేస్ బుక్, వాట్స్ అప్, ఇన్ స్టాగ్రామ్ ల వినియోగంలో జాగ్రత్తగా ఉండాలని , ఫోటోలు, వీడియోలను పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని ఎస్పీ సూచించారు. పట్టుదలతో ఉన్నత స్థాయిని అధిరోహించాలని, ఆ క్రమంలో తప్పుదారులు పట్టకుండా, తల్లిదండ్రులు నమ్మకాన్ని వమ్ముచేయకుండా జీవితంలో కష్టపడి సొంత కాళ్ళ పై నిలబడాలని ఎస్పీ సూచించారు.

### రోడ్డు ప్రమాద మరణాల్లో సగం మంది యువకులే :ఎస్పీ

ప్రస్తుత రోజుల్లో మనదేశంలో సగటున ప్రతి సంవత్సరం లక్షయాబై వేల మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి చనిపోవడం జరుగుతుందని ఇందులో 50శాతం మంది యువతే ఉన్నారని యువత చనిపోవడం వల్ల తల్లిదండ్రులతో పాటు దేశాన్ని కూడా చాలా తీవ్రమైన నష్టం కలుగుతుందని ఎస్పీ భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు.జిల్లాలోని యువత రోడ్డు ప్రమాదాలను బారిన పడి మృతి చెందడం చాలా బాధాకరమని ఈసంఘటనలను చూసి కలచి వేసి చేజారి న కొడుకు అనే పాటను తానే స్వయంగా రాయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.ఈపాట ద్వారా ఏ ఒక్కరైనా మారితే చాలా సంతోషం అని అన్నారు. ఈ సందర్భంగా యువతకు ఎస్పీ భాస్కర్ స్వయంగా రచించిన పాటను స్క్రీన్ పై ప్రదర్శించి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం చేజారిన కొడుకు అనే పాట పాడిన గాయని సౌమ్య, దర్శకుడు రాజ నరేంద్ర, కెమెరామెన్ నరేష్, బలగం ఫేమ్ సుజాత, నటినటులను జిల్లా ఎస్పీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రవీంద్ర రెడ్డి, సి.ఐ లు లక్ష్మీనారాయణ, ప్రవీణ్ కుమార్, ఎస్. ఐ లు శ్యామ్ రాజ్, నవీన్, ఉమాసాగర్, కిరణ్ కుమార్, కళాబృందం సభ్యులు, కళాశాలల విద్యార్థిని,విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



Edited, Printed, Published & owned by GOSUKONDA PRUDHVIRAJU, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at Panidhar PUBLICATIONS. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: GOSUKONDA PRUDHVIRAJU,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in